క్లుప్తంగా

ఆట వస్తువులు పంపిణీ



ఆట వస్తువులు అందజేస్తున్న రౌతు శ్రీను

ఆనందపురం : మండలంలోని పాలవలస అంగన్‌వాడీ కేంద్రం పిల్లలకు మంగళవారం ఆట వస్తువులను పంపిణీ చేశారు. భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రౌతు శ్రీను సొంత నిధులతో 30 మంది పిల్లలకు ఆట వస్తువులు, కుర్చీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వస్తువుల ద్వారా విద్య నేర్పడం వల్ల పిల్లల్లో జ్ఞాపక శక్తి పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త పద్మావతి, ఆయా కుమారి తదితరులు పాల్గొన్నారు.

మూగ జీవులను హింసించడం నేరం



మాట్లాడుతున్న పశువైద్యాధికారిణి అనుపమ

పద్మనాభం: మూగ జీవులను హింసించడం, బలివ్వడం జంతు హింస చట్టం ప్రకారం నేరమని పాండ్రంగి పశు వైద్యాధికారిణి ఆర్.అనుపమ అన్నారు. మండలంలోని పాండ్రంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జంతు హింస నిరోధక చట్టంపై బుధవారం అవగాహన కల్పించారు. మూగ జీవులను ప్రేమించాలన్నారు. కార్యక్రమంలో కోసర అప్పలనాయుడు పాల్గొన్నారు.

యాంటీ బయోటిక్స్‌తో ముప్పు

కొమ్మాది: అనారోగ్య సమస్యలతో చికిత్స తీసుకునే సమయంలో మితిమీరిన యాంటీ బయోటిక్ ఔషధాలు వాడటం ప్రజారోగ్యానికి ముప్పుగా పరిణమిస్తుందని, ముఖ్యంగా రోగ నిరోధక శక్తిని నశింపచేస్తుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆగ్నేయ ఆసియా దేశాల ప్రాంతీయ విభాగం మాజీ సలహాదారుడు, యూకేలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ స్టడీస్ గౌరవ ప్రొఫెసర్ కేథరిన్ అన్నె హోలోవే పేర్కొన్నారు. గీతం వర్సిటీలో బుధవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. యాంటీ బయాటిక్స్ ఎక్కువగా వాడటం వల్ల యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ సమస్య పెరుగుతుందన్నారు. 2050వ సంవత్సరం నాటికి ప్రపంచ వ్యాప్తంగా పది మిలియన్ల జనాభా ఈ సమస్యతో మరణిస్తారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

తహసీల్దార్ రామారావుకు అవార్డు



అవార్డు అందుకుంటున్న తహసీల్దార్ రామారావు

ఆనందపురం : ఆనందపురం తహసీల్దార్ లోకవరపు రామారావు కలెక్టర్ మల్లికార్జున చేతుల మీదుగా బుధవారం అవార్డు అందుకున్నారు. నగరంలోని వుడా చిల్డ్రన్స్ థియేటర్‌లో జరిగిన జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆయనకు ఉత్తమ సహాయ ఎలక్ట్రోరల్ అధికారి అవార్డుని కలెక్టర్ అందజేశారు. ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పుల ప్రక్రియలో చురుగ్గా పాల్గొన్నందుకు ఈ అవార్డుని అందజేశారు. జిల్లా న్యాయమూర్తి గోపి, జేసీ విశ్వనాథన్, ఆర్డీవో భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

- ఉత్సాహంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

తగరపువలస: ప్రజాస్వామ్యానికి ఓటు పట్టుగొమ్మ వంటిదని, ఎన్నికల సమయంలో వజ్రాయుధమని, అటువంటి పవిత్ర ఓటును అమ్ముకోవద్దని భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా భీమిలి మండలం తాళ్లవలస యూపీ పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సీనియర్ ఓటర్లు నరసింహమూర్తి రాజు, ఎద్దు రమణ, లక్ష్మిలను సత్కరించారు. అనంతరం ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బోని సన్నిబాబు, వీఆర్వో వెంకట అప్పారావు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, దంతులూరి వేణురాజు పాల్గొన్నారు.

- జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట అంబేడ్కర్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు వై.జగన్నాథస్వామి ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు ప్రాముఖ్యతను వివరించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మాజీ కౌన్సిలర్ జీవీ రమణ, సచివాలయ సిబ్బంది ఎం.స్పందన, డబ్బీరు సతీష్‌కుమార్, జి.ఉష, సచివాలయ కన్వీనర్లు రొక్కం శ్రీను, జి.సృజన, జి.సౌజన్య, ఎస్.జగదీష్ పాల్గొన్నారు.

- జీవీఎంసీ రెండో వార్డు రాయపాలెం హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో ఓటు ఆవశ్యకతను తెలియజేస్తూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఓటు ఆవశ్యకత తెలియజేస్తూ చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు అంబేడ్కర్ కూడలిలో అవగాహన కల్పించారు. డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ ఎ.అర్జునరావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కన్వీనర్ ఎస్.షరీఫ్ పాల్గొన్నారు.



భీమిలిలో సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న ఆర్డీవో భాస్కరరెడ్డి

భీమునిపట్నం: భీమిలిలో బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవం నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి, ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆర్డీవో భాస్కరరెడ్డి మాట్లాడుతూ మన దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తామని, ఇందులో తారతమ్యాలు ఉండవన్నారు. ఓటర్లు ఎన్నికల సమయంలో బాధ్యతతో ఓటు వేయాలని కోరారు. ప్రలోభాలకు గురికాకుండా సరైన వారిని ఎన్నుకుని దేశానికి మేలు జరిగేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్లను సత్కరించారు. అనంతరం విద్యార్థులు మెయిన్ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. జోనల్ కమిషనర్ బొడ్డేటి రాము, ఇతర అధికారులు పాల్గొన్నారు.



నరసింహమూర్తిరాజును సత్కరిస్తున్న తాళ్లవలస ప్రజాప్రతినిధులు



అంబేడ్కర్ కూడలిలో అవగాహన కలిగిస్తున్న అవంతి విద్యార్థులు



ప్రతిజ్ఞ చేస్తున్న రాయపాలెం జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులు

సుత్తమ్మతల్లికి ప్రత్యేక అలంకరణ

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ గ్రామదేవత సుత్తమ్మ తల్లిని బుధవారం స్థానిక భవానీ పీఠం ప్రతినిధులు 250 కిలోల వాక్కాయల (చెర్రీ)తో అలంకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారికి ఎరుపు రంగు అంటే ప్రీతి అని... ఆమెకు అలంకరించిన కిరీటంలో ఉన్న మణి, కెంపులు ఎర్రనివి అమర్చినట్టు తెలిపారు. అలాగే చెవిపోగులు, దిద్దులు, ముక్కెరను ఎర్రని రాళ్లతో అలంకరించామన్నారు. మెడలో ధరించిన హారములలో రత్నాలు ఎర్రని కురువింద మణులతో ఉన్నాయన్నారు. చివరకు అమ్మవారి విగ్రహంలో పెదవులు, వడ్డాణం, గాజులు, ఉంగరాలు, పారాణి, చీర, పుష్పమాల ఎర్రటివే అలంకరించామన్నారు. పాదాల నుంచి శిరస్సు వరకు ఎర్రని రంగులో అమ్మవారిని భక్తులకు దర్శనం కల్పించేందుకు ప్రత్యేకంగా వాక్కాయలు కొనుగోలు చేసి దండలు కట్టించామన్నారు. ఆ అలంకరణకు సుమారు రూ.40 వేలు ఖర్చు చేసినట్టు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



అలంకరణలో చిప్పాడ గ్రామదేవత సుత్తమ్మతల్లి

హైవేని ఆనుకుని ఇష్టానుసారంగా నిర్మాణాలు

- చోద్యం చూస్తున్న జీవీఎంసీ అధికారులు

మధురవాడ: జీవీఎంసీ జోన్ – 2 కేంద్రం మధురవాడలో ఇప్పటికే ట్రాఫిక్ ఇబ్బందులు నిత్యకృత్యమయ్యాయి. మధురవాడ పీహెచ్‌సీ, బస్ షెల్టర్‌ను ఆనుకుని చాలా మంది కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని అమ్మకాలు మీద అమ్మకాలు చేసేశారు. అక్కడితో ఆగకుండా ఒక్క షాపు ముందు రెండేసి దుకాణాలకు తక్కువ లేకుండా రకరకాల నిర్మాణాలు చేసి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్నారు. ఇప్పుడు తాజాగా పక్కనే ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ ముందు కొందరు వ్యక్తులు అరడజను వరకు రేకుల షెడ్లు నిర్మిస్తున్నారు. వీరు ఎటువంటి ప్లాన్‌లు, అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా నిర్మాణాలు చేసేస్తున్నారు. ఇటీవల జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు చంద్రంపాలెం హైస్కూల్ లోపల రోడ్డును అనుకుని హైవే విస్తరణ ఉన్న కారణంగా అదనపు తరగతి గదుల నిర్మాణానికి వీలు కాదని చెప్పారు. అలాంటిది రోడ్డును ఆనుకుని ప్రైవేటు వ్యక్తులు ఇష్టానుసారంగా నిర్మాణాలు చేసేస్తుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులైనా తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



జాతీయ రహదారి పక్కన మధురవాడ బస్టాప్‌ని ఆనుకుని దుకాణాల ఎదుట నిర్మిస్తున్న షెడ్లు

గ్రామాల్లో హిందూ ధర్మ ప్రచారం

ఆనందపురం: మండలంలోని రామవరం, గండిగుండం గ్రామాల్లో బుధవారం త్రైత సిద్ధాంత హిందూ జ్ఞాన వేదిక, ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో హిందూ ధర్మ ప్రచారాన్ని నిర్వహించారు. విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, సభ్యులు సూరప్పుడు, పైడన్న, సన్యాసి తదితరులు ఇంటింటికీ వెళ్లి స్వామి వారు ప్రవచించిన ఆత్మ జ్ఞానాన్ని తెలుసుకొని అందరూ జ్ఞానులు కావాలని బోధించారు. గీత జ్ఞానం ద్వారా కర్మ విధానం తెలుసుకొని మోక్షం పొందాలని సూచించారు. దేవుడిని పూజించడం మాత్రమే కాకుండా ఆయన అందించిన గీత జ్ఞానం ద్వారా కర్మ విధానం తెలుసుకొని మోక్షం పొందాలని భగవంతుని మాటగా తెలియజేశారు. కార్యక్రమంలో సభ్యులు పోలీస్ నాయుడు, బి.అప్పలనాయుడు, కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలతో పాముల బెడద

భీమునిపట్నం: భీమిలి చిన్నబజారు సమీపంలో ఉన్న జమ్మిచెరువు పార్కు మధ్యలో పెద్ద ఎత్తున గడ్డి, పిచ్చిమొక్కలు పెరిగిపోవడం సమస్యగా మారింది. ఈ చెరువు నిత్యం నీటితో నిండి ఉంటుంది. వేసవిలో కూడా నీరు ఇంకిపోదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని 2006లో అధికారులు పార్కు ఏర్పాటు చేశారు. అలాగే సందర్శకులు సేద తీరడానికి చెరువు చుట్టూ సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇక్కడకు చాలా మంది వచ్చి సేద తీరుతుంటారు. అయితే గడ్డి, పిచ్చి మొక్కలు ఉండడంతో పాములు విపరీతంగా సంచరిస్తున్నాయి. ఈ పార్కులోకి సందర్శకులు బెంచీలు, నేలపై కూర్చున్నప్పుడు వారి పక్క నుంచి పాములు వెళ్తుండడంతో భయాందోళనకు గురవుతున్నారు. ఈ కారణంతో పార్కుకు చాలా మంది రావడం మానేశారు. సంబంధిత అధికారులు స్పందించి గడ్డి, పిచ్చి మొక్కలు తొలగించాలని సందర్శకులు కోరుతున్నారు.



గడ్డి, పిచ్చి మొక్కలతో మూసుకుపోయిన జమ్మి చెరువు

చిల్డ్రన్స్ పార్కులో తుప్పల తొలగింపు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సంగివలస చెరువును ఆనుకుని ఉన్న చిల్డ్రన్స్ పార్కులో పారిశుధ్య సిబ్బంది రెండు రోజులుగా తుప్పలు తొలగిస్తున్నారు. ఇటీవల పార్కులో భీమిలి జెడ్సీ బి.రాము పర్యటించినప్పుడు ఆట వస్తువులు తుప్పల మాటున ఉండిపోవడంతోపాటు వాకింగ్ ట్రాక్‌పై ఇసుక పేరుకుపోయి కనిపించింది. దీంతో ఆయన ఆదేశాల మేరకు... పార్కులోకి వచ్చే పిల్లలు, వృద్ధులకు ఇబ్బంది కలగకుండా నలుగురు పారిశుధ్య సిబ్బంది తుప్పలు తొలగించడంతోపాటు వాకింగ్ ట్రాక్‌పై ఇసుక, మట్టిని తొలగిస్తున్నారు. ప్రస్తుతం పార్కులో కొంత వరకు శుభ్రత చేకూరడంతో ఇక్కడకు వచ్చేవారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా చెరువు చుట్టూ ఉన్న పాలిథిన్ వ్యర్థాలు, సిమెంట్ బెంచీల చుట్టూ తుప్పలు తొలగించి శుభ్రం చేయించాలని కోరుతున్నారు. వృద్ధుల కోసం డీవీస్ యాజమాన్యం నిర్మించిన ఎల్డర్స్ ఎరీనాలో ఆకతాయిలు, తాగుబోతుల ఆగడాలు లేకుండా కాపలాదారులను నియమించి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



తుప్పలు తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

ఘనంగా 'జయహో జనగణమన'



జనగణమన జాతీయ గీతాలాపన చేస్తున్న జెడ్సీ రాము, విద్యార్థులు

భీమునిపట్నం: విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన జనగణమనను జాతీయ గీతంగా ఆమోదించి 73 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఇక్కడి స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ (సన్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జయహో జనగణమన వారోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులు గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము మాట్లాడుతూ జగనణమన గీతం ద్వారా మన భారతదేశం గొప్పదనాన్ని ఎంతో అద్భుతంగా ఠాగూర్ వివరించారన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి కన్వీనర్ మైలిపల్లి షణ్ముఖరావు మాట్లాడుతూ నేటి విద్యార్థులకు ఈ గీతం గొప్పదనం తెలియజేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. సన్ నెట్‌వర్క్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణమూర్తి మాట్లాడుతూ దేశభక్తి, సమైక్యత పెంపొందించే కార్యక్రమాలను తాము నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ పి.ఉషారాణి, ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి (ఫ్యాబ్) ప్రతినిధులు కాళ్ల సన్నీ, మునునూరి శ్రీనివాస్, వుయ్ కేర్ యూ సంస్థ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి, వృక్ష ఫౌండేషన్ అధ్యక్షుడు కాకర సురేష్, కొయ్య రామకృష్ణ, మహమ్మద్ ఇషాక్, కర్రి నరేష్ పాల్గొన్నారు.

చెరువు ఆక్రమిస్తున్నారని రైతుల ఆందోళన

పద్మనాభం: మండలంలోని పొట్నూరు గవరరాజు చెరువును ఆక్రమించి పనులు చేపడుతున్నారని బుధవారం ఆ చెరువు వద్ద రైతులు ఆందోళన చేశారు. ఈ చెరువు కింద విజయనగరం జిల్లా జామి మండలం కుమరాం గ్రామానికి చెందిన రైతులకు భూమి ఉంది. ఒక వ్యక్తి తన భూమిలో పనిచేయడానికి కొంత మందిని బుధవారం ఉదయం పంపించాడు. సదరు వ్యక్తులు పని చేస్తుండగా ఇది చెరువు గర్భమని, పని చెయ్యవద్దని పొట్నూరు రైతులు అడ్డుకున్నారు. తర్వాత చెరువు వద్ద ఆందోళన చేశారు. దీంతో రైతులకు, పనివారికి మధ్య వాగ్వివాదం జరిగింది. ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో విషయం తెలుసుకున్న పద్మనాభం పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఇరు వర్గాల వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. సదరు భూమి జిరాయితీయా, చెరువు గర్భమా అనేది రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లి నిర్ధారించుకోవాలని ఇరువర్గాల వారికి కౌన్సెలింగ్ చేసి పంపించారు.



చెరువు సమీపంలో పని చేసే స్థలం వద్ద రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

సంక్షేమ పథకాలతో ప్రజల్లో సంతోషం

కొమ్మాది: రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొంది ప్రజలంతా సంతోషంగా వున్నారని, అందువల్లే ఎక్కడకు వెళ్లినా ప్రజలంతా నీరాజనం పడుతున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 5వ వార్డు మారికవలస గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల సమస్యలు వింటూ, వాటిని పరిష్కరిస్తూ, సంక్షేమ పథకాల అమలును వివరిస్తూ ముందుకు సాగారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ గడప వద్దకే సంక్షేమ పథకాలు చేరుస్తున్న ఏకైక ప్రభుత్వం దేశంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రమేనన్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. పలు చోట్ల రోడ్లు, డ్రైనేజీల సమస్యలు ఉన్నట్లు తెలపగా వాటిని పరిష్కరించాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఇక్కడ శిథిలావస్థకు చేరుకున్న వాటర్ ట్యాంకును తొలగించి సామాజిక భవనం నిర్మించాలని కోరగా రూ.20 లక్షల నిధులు మంజూరు చేశారు. అదే విధంగా ఇక్కడి ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరుకుందని, దాన్ని తొలగించేందుకు అనుమతి కావాలని ఉపాధ్యాయులు కోరగా ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న కల్లుగీత కార్మికుడితో కాసేపు మాట్లాడి కష్టసుఖాలు తెలుసుకున్నారు. టీడీపీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ మన్యాల సోంబాబు త్వరలో పార్టీలో చేరబోతున్నట్లు నాయకులు తెలపగా ఆయన కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతరావు, నాయకులు, కన్వీనర్లు జేఎస్ రెడ్డి, ముచ్చు రామారావు, పోతిన సురేష్, గుంటుబోయిన సంజీవ్ యాదవ్, లోహిత్, రాయిని సాయి, బోయి సూరిరెడ్డి, బాబ్జి, సన్ని, రజిని తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల కరపత్రం మహిళకు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భూములు కేటాయించాలని వేడుకోలు

భీమునిపట్నం: భీమిలి పరిధిలో అధికారులు ల్యాండ్ పూలింగ్ ద్వారా తమ నుంచి సేకరించిన భూములకు ప్రత్యామ్నాయంగా ఇస్తామని చెప్పిన భూములను తమకు వెంటనే కేటాయించి న్యాయం చేయాలని రైతులు కోరారు. ఈ మేరకు కొత్తవలస, జేవీ అగ్రహారం, నిడిగట్టు, అన్నవరం ప్రాంతాలకు చెందిన రైతులు బుధవారం సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా రైతులు వెలపల రామారావు, కలిదిండి రామశెట్టి మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం అధికారులు కోరిన మేరకు ప్రభుత్వానికి తమ భూములు అప్పగించామన్నారు. ఇందుకు ప్రత్యామ్నాయంగా అన్ని సదుపాయాలతో కూడిన భూములను ఆరు నెలల్లో అప్పగిస్తామని వారు హామీ ఇచ్చినా నేటికీ నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులను ఎన్నోసార్లు కలుస్తున్నామని, సంక్రాంతికల్లా భూములు కేటాయిస్తామని చెప్పినా జరగలేదన్నారు. దీనివల్ల తాము చాలా ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి మాకు భూములు కేటాయించాలని కోరారు.



ధ్రువీకరణ పత్రాలు చూపుతున్న రైతులు

యువకుడు అదృశ్యం

తగరపువలస: భీమిలి మండలం అన్నవరం పంచాయతీ పైలపేటకు చెందిన 22 ఏళ్ల యువకుడు పైల రవి ఈ నెల 3న రాత్రి 10 గంటల తర్వాత ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. తర్వాత నుంచి రవి ఫోన్ కూడా పనిచేయకపోవడంతో ఇప్పటి వరకు కుటుంబ సభ్యులు గాలించారు. అయినప్పటికీ ఆచూకీ తెలియకపోవడంతో బుధవారం భీమిలి పోలీసులకు రవి తండ్రి అప్పన్న ఫిర్యాదు చేశాడు. ఎఎస్‌ఐ సింహాచలం కేసు దర్యాప్తు చేస్తున్నారు. చిప్పాడ డివీస్ లేబరేటరీలో కార్మికునిగా రవి పనిచేస్తుండేవాడు.



పైల రవి (ఫైల్)

జాతీయ జెండాతో ర్యాలీ

పద్మనాభం: రిపబ్లిక్ డేను పురస్కరించుకుని మండలంలోని కొత్త కొవ్వాడలో విద్యార్థులు బుధవారం వంద అడుగుల జాతీయ జెండా పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఊరంతా ఆ జెండాతో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొత్త కొవ్వాడలో జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

చిప్పాడ హైస్కూల్ పరిశీలన

తగరపువలస: భీమిలి డైట్ అధ్యాపకురాలు హరిణి మండలంలోని చిప్పాడ హైస్కూల్‌ను బుధవారం సందర్శించారు. 3, 4, 5, 6, 8 తరగతులకు వెళ్లి విద్యార్థులతో పుస్తకాలు చదివించి రీడింగ్ స్కిల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం పాఠశాలలో అమలవుతున్న పథకాలను అడిగి తెలుసుకుని, పరిశీలించారు. ముఖ్యంగా ఉపాధ్యాయుల బోధన ప్రణాళిక, డైరీలు, విద్యార్థుల పాఠ్య పుస్తకాలు, వర్కు పుస్తకాలు పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు రేక అప్పారావు, ఉపాధ్యాయులు ఆమెకు అవసరమైన సమాచారం అందించారు.